ప్రకృతి ప్రకోపం.. ప్రభుత్వ నిర్లక్ష్యం



ఈదురుగాలులతో నక్కపల్లి మండలంలో నేలకు ఒరిగిన వరిపంట

- అన్నదాతలను కలవరపెడుతున్న వైపరీత్యాలు
- తాజాగా ఫెంగల్ బెంగ
- పాయకరావుపేట నియోజకవర్గంలో 24వేల ఎకరాల్లో వరిసాగు
- కూటమి ప్రభుత్వంలో అందని పెట్టుబడి సాయం
- గత ప్రభుత్వ హయాంలో 41వేలమందికి రూ.24కోట్లు రైతుభరోసా

నక్కపల్లి: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న అన్నదాతలపై ఒక పక్క ప్రకృతి, మరో పక్క కూటమి ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తున్నాయి. అకాల వర్షాలు, వితప్కర పరిస్థితుల వల్ల రైతులు నష్టపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఏర్పడిన ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను తీవ్ర అవస్థలకు గురి చేశాయి. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయి. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాల కారణంగా 6,000 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా కేవలం 2,200 ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అయితే ఆ నష్టపరిహారాన్ని కూడా ఇంత వరకు కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. ఖరీఫ్ ప్రారంభమైన జులైనుంచి పంట చేతికి వచ్చే డిసెంబరు వరకు రైతన్నల పరిస్థితి గాలిలో దీపంలా ఉంటోంది.వాతావరణ శాఖనుంచి ఎప్పుడు ఏ హెచ్చరిక వినాల్సి వస్తుందోనంటూ బిక్కుబిక్కుమనే దుస్థితి ఏర్పడింది.ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు మరోపక్క,తెగుళ్లు రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఈ ఖరీఫ్ నాట్లు వేసిన తర్వాత సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు అష్టకష్టాలు పడి నీటిని బయటకు పంపారు. నీరు నిల్వలేకుండా వరిని కాపాడుకున్నామనే ధీమాగా ఉన్న సమయంలో తాజాగా పెంగల్ తుఫాన్ వారి గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. గడచిన రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు, కురుస్తున్న చిన్నపాటి వర్షం కారణంగా ఉపమాక, సారిపల్లిపాలెం, చందనాడ, నక్కపల్లి, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, కాగిత తదితర గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరిపైరు నేలకు ఒరిగింది. కష్టమంతా నీటిపాలవుతుందనే భయంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ఏడాది ఇలా వరికోతలు పూర్తయ్యాక పడిన వర్షాలకు వరిపనలన్నీ నీటమునిగాయి.



సెప్టెంబరులో వచ్చిన తుపానుకు నక్కపల్లి మండలంలో నీట మునిగిన వరిపొలాలు (ఫైల్)



పాయకరావుపేట మండలంలో సెప్టెంబరులో మునిగిన వరిపంటను అధికారులకు చూపిస్తున్న రైతులు(ఫైల్)

అప్పుడలా..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కింద ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రూ.13,500 అందజేసేవారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గడచిన ఐదేళ్లలో 41,071 మందికి రైతు భరోసా పథకం ద్వారా రూ.24కోట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను గత ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించింది.దీంతో రైతులు అప్పు చేయాల్సిన దుస్థితి ఉండేది కాదు. ఎరువులు, విత్తనాలు కూడా సబ్సిడీపై ముందుగానే అందజేసేవారు.

ఇప్పుడిలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పైసా సాయం అందించలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామని టీడీపీ, జనసేన ప్రకటించాయి. అధికారంలోకి వచ్చి ఖరీఫ్ సీజన్ ముగిసినప్పటికీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్ముకోవడం కంటే భూమితల్లిని, వరుణుడిని నమ్ముకుంటే మేలని భావించిన రైతులు అప్పు చేసి మరీ వరి సాగు చేశారు.నాలుగు తిండి గింజలు పండించుకుందామని ఆశపడిన అన్నదాతలకు తుపాను హెచ్చరికలు అశనిపాతంలా పరిణమిస్తున్నాయి.

పాయకరావుపేట నియోజవర్గంలో వరిసాగు వివరాలు	
మండలం	ఎకరాలు
ఎస్.రాయవరం	10,000
పాయకరావుపేట	6,000
నక్కపల్లి	4,400
కోటవురట్ల	4,000

ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం లేదు



ఖరీఫ్ సీజన్‌ప్రారంభమయ్యాక ప్రకృతి వైపరీత్యాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం లేనప్పటికీ ఎకరాకు సుమారు రూ.20వేలు పైనే పెట్టుబడి పెట్టి వరి సాగు చేశాను. పంట కోతకు చేరిన సమయంలో తుపాను హెచ్చరికలతో ఏం చేయాలో తోచని పరిస్థితి నెలకొంది. రెండు రోజులనుంచి వీస్తున్న ఈదురుగాలులకు వరి పంట నేలకు ఒరుగుతోంది.తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20వేలు సాయం చేస్తామని కూటమిపార్టీలు హామీ ఇచ్చాయి.అధికారం చేతికి వచ్చి.. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నప్పటికీ పైసా సాయం చేయలేదు. **– పోతంశెట్టిబాబ్జి,** రైతు, కాగిత, నక్కపల్లి మండలం

నష్టపరిహారం అందలేదు



సెప్టెంబరు నెలలో వచ్చిన తుపానుకు వరిపొలాలు నీటమునిగాయి. నీరు బయటకు తీసుకోడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. అధికారులు వచ్చి నష్టాన్ని అంచనా వేశారు. చాలా వరకు పంట కుళ్లిపోయింది. ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఒక్కపైసా నష్టపరిహారం అందలేదు. ఎక్కువ నష్టం వాటిల్లితే అధికారులు మాత్రం తక్కువ జరిగినట్లు నివేదికలు సమర్పించారు. అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఖరీఫ్‌సీజన్ ముగిసినప్పటికీ ఒక్కపైసాకూడా ఇవ్వలేదు.

– సత్యకిరణ్, రైతు, గుంటపల్లి

క్లుప్తంగా

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



ప్రతిభ చూపిన విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేస్తున్న పీఎంసీ చైర్మన్ సూర్యచంద్రరావు

మునగపాక: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు అన్నారు. ఇక్కడ ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌లో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కె.వి. రమణ,మాడెం జోగారావు, పిల్లా జగదీష్, బొడ్డేడ అచ్యుతకృష్ణ,మారిశెట్టి వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



బోస్ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని తోటాడలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది.తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1989–90వ సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం నాటి గురువు బోస్ దంపతులను ఘనంగా సత్కరించారు. అలాగే ఇదే బ్యాచ్‌కు చెందిన టి.సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడును సన్మానించారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: సీపీఎం మహాసభలను ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు నర్సీపట్నంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ ఆర్.రాము తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో కె.సోమునాయుడు,కర్రి అప్పారావు, కె.రామసదా శివరావు తదితరులు పాల్గొన్నారు.

నమూనా పరీక్షకు విశేష ఆదరణ



ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

కశింకోట: డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్‌ఎంఎంఎస్) కోసం నిర్వహించే పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన నమూనా పరీక్షకు విశేష ఆదరణ లభించింది. సుమారు 300 మంది విద్యార్థులు వివిధ హైస్కూళ్ల నుంచి పరీక్షకు ఉత్సాహంగా హాజరయ్యారు. వీరి పేపర్లను మూల్యాంకనం చేసి వారిలో ప్రతిభ చూపిన 16 మందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్. తమ్మిరాజు మాట్లాడుతూ నమూనా పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, వచ్చే వారం ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిభా పరీక్షను విద్యార్థులు భయం లేకుండా సునాయాసంగా రాయడానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు, ప్రతినిధులు డి. నూకేష్, ఎస్. రమేష్, మల్లేశ్వరరావు, కొణతాల సోమశేఖర్, ఏవిఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్న సమారాధన



బీజేపీ నాయకుడు సూర్యనారాయణను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో కార్తీక మాసం నెలరోజుల పాటు నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. గత నెల 2వ తేదీన నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధనను ప్రారంభించారు. రోజుకు వెయ్యిమందికి తక్కువ కాకుండా భక్తులకు నెలరోజుల పాటు అన్న ప్రసాదం స్వీకరించారు. ముగింపు కార్యక్రమంలో బీజేపీ నేతలు పరమేష్, సూర్యనారాయణలను సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు,వీఆర్వోల సంఘ నాయకులు బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు తదితరులు ఘనంగా సత్కరించారు. బద్దెం ప్రతాప్, మాదవవర్మ,పండూరి కనకప్పారావు,ఆళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంకీర్తనలు, కోలాటం



సంకీర్తనలు ఆలపిస్తున్న మునగపాక కళాకారులు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం,సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి.సిరసపల్లిలోని సతకంపట్టు గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా మునగపాకకు చెందిన అన్నమయ్య స్వరతరంగిణి కళాకారులు పలు సంకీర్తనలను ఆలపించారు. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పాటిపల్లిలో గ్రంథాలయం అదనపు గదిని ప్రారంభిస్తున్న మహాలక్ష్మినాయుడు దంపతులు

మునగపాక: ప్రతి ఒక్కరూ 'మాఊళ్లో గ్రంథాలయం' సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ ప్రోత్సాహకులు గాజువాకకు చెందిన భీశెట్టి మహాలక్ష్మినాయుడు దంపతులు కోరారు. మండలంలోని పాటిపల్లి 'మాఊళ్లో గ్రంథాలయం' ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు గదిని ఆదివారం వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రను, స్థానికులు ఆడారి రామకృష్ణ, ఆడారి గోవింద జగన్నాథ్,యల్లపు సంజీవరావు,ఆడారి అప్పలనాయుడు,సునీత, తులసి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం



కొక్కిరాపల్లిలో నిర్వహిస్తున్న ర్యాలీ

యలమంచిలి రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని బాలల హక్కుల పరిరక్షణ జిల్లా కమిటీ సభ్యుడు డి.లోవరాజు తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరిస్తూ యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులు,స్నేహితులతో సహా దానితో సంబంధమున్న వారందరిపై క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నారు. గ్రామంలోని ప్రధానవీధి మీదుగా చేపట్టిన ర్యాలీలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు,స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.గ్రామంలో సామాజిక భవనం వద్ద మహిళలతో జరిగిన సమావేశంలో బాల్య వివాహాలు,పిల్లల్ని చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం తదితర విషయాలపై వివరించారు.కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు,ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు బీబీ పాల్గొన్నారు.


నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: సత్యం గల తల్లిగా,భక్తుల పాలిట కొంగుబంగారంగా కొలువైన యలమంచిలిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ధర్మవరంలో కొలువుదీరిన అమ్మవారికి సంప్రదాయం ప్రకారం స్వర్గీయ కొటారు రాంబాబు కుటుంబ సభ్యులు తొలిపూజ నిర్వహిస్తారు. అనంతరం మహిళలు బిందెలతో తెచ్చిన నీటితో పూజలు చేస్తారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొటారు సాంబ తెలిపారు.మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు,హోమాలు,అభిషేకాలు చేస్తారు.లక్ష్మీప్రదమైన ఈ మాసం శ్రీ మహాలక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనది.అందుకే మార్గశిర లక్ష్మి(గురు)వారాల్లో ఆమెను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతి గురు,శుక్రవారాల్లో అమ్మవారిని పూజించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి సహకరించాలి



పనులను పరిశీలిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఆదివారం ఆలయ నిర్మాణ పనులను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల విరాళాలతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు మరింత వేగవంతమయ్యేలా చూడాలన్నారు. రూ.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులను కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, కమిటీసభ్యులు కాండ్రేగుల జగ్గారావు,వెలగా శ్రీనివాసరావు,పెంటకోట ఉమేష్, మొల్లేటి సత్యనారాయణ,ఆడారి కృష్ణ, నూకనరసింగరావు,జల్లేపల్లి కిష్టప్ప,విల్లూరి మోహన్,మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చూచుకొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక: చూచుకొండలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆస్పత్రి వైద్యాధికారి ఎల్.నరసింహమూర్తి రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. శిబిరాన్ని సర్పంచ్ దొడ్డి సూరప్పారావు ప్రారంభించారు.ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్,పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి



హరిపాలెంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న పెద్దలు

అచ్యుతాపురం: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని పలువురు కోరారు.మండలంలోని హరిపాలెం తులసీకల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హైందవ సమ్మేళనంలో మాట్లాడుతూ శంఖారావం కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. సమ్మేళనంలో మంతా సుబ్బారావు,మారిసెట్టి సూర్యనారాయణ,దొడ్డి కృష్ణ,బి.వి రమణ,చింతకాయల రాజు,కొల్లి అప్పారావు,సీతారాం పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జోగులు జన్మదిన వేడుకలు



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎస్.రాయవరం: వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు జన్మదిన వేడుకలు అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయానికి చేరుకుని వేడుకల్లో పాల్గొన్నారు. కంబాల జోగులకు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి , మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు,జిల్లా కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, చోడిపల్లి గోవిందు,వైఎస్సార్‌సీపీ నాయకులు వెలగా శ్రీనివాసరావు,మందగుదుల వెంకటరమణ,పొలుమూరి అప్పలరాజు,కర్రి శ్రీనుబాబు,వియ్యపు సింహాద్రి,చోడిపల్లి కోదండ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



హరిపాలెం పీహెచ్‌సీలో ఎయిడ్స్‌పై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించ వచ్చని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా హరిపాలెంలో పీహెచ్‌సీలో ఆదివారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్,హెచ్ఐవీని నియంత్రించడంలో దేశం విశేషమైన పురోగతి సాధించిందన్నారు.ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్,ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమా మహేష్,సునీత,వైద్య సిబ్బంది ఇందిర,గణేశ్,ముకేష్,లక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల: హెచ్ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ వైద్య సిబ్బంది నినదించారు. స్థానిక రాజాసాగి సూర్యకాంతమ్మ సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నుంచి ప్రధాన కూడలి వరకు హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తూ నినాదాలతో ర్యాలీ చేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత వద్దని, ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు



రాంబిల్లి లో ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాంబిల్లి (యలమంచిలి): భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాంబిల్లిలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి రావలసిన ప్రోత్సాహకాలుఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని చెప్పారు. కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ,మత్స్యకార సంఘం నాయకులు దోని కాసీయా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాకపకశాఖ సిబ్బంది

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం వెళ్లే రోడ్డులో ఇటుక బట్టీల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. బట్టీలో పనిచేస్తున్న ఐదు గురు కూలీలు వారు నివాసముంటున్న షెడ్డు పక్కనే ఉన్న పూరింట్లో వంటగ్యాస్ స్టౌ పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు అంటుకున్నాయి. అందిన సమాచారం మేరకు అగ్నిమాకప శాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. పాకలో ఉన్న రెండు మంచాలు,దుస్తులు,బియ్యం,కిరాణా సామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.30వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు.

నేలకొరిగిన వరి చేను



యండపల్లిలో నేలకొరిగిన వరి చేను

కోటవురట్ల: ఫెంగల్ అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల కారణంగా వరి చేలు నేలకొరుగుతున్నాయి. కోతలు మొదలు పెట్టే సమయంలో తుపాను రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కైలాసపట్నం, కోటవురట్ల, రాజుపేట, గొట్టివాడ, రామచంద్రపురం, జల్లూరు, యండపల్లి, బి.కె.పల్లి, పాములవాక, కొడవటిపూడి, అన్నవరం, కె.వెంకటాపురం ప్రాంతాల్లో వరిచేను నేలవాలింది.



కైలాసపట్నంలో నేలకొరిగిన వరి చేను

ఎస్.రాయవరం: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరిచేను నేలకొరిగింది. వెంకటాపురం, దార్లపూడి, పెట్టుగోళ్లపల్లి,చినగుమ్ములూరు తదితర గ్రామాల్లో పంట దెబ్బతింది. నేలకొరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టుకుని సంరక్షించుకోవాలని మండల వ్యసాయాధికారిణి సౌజన్య చెప్పారు. తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఉదయంనుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.